


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 03-05-2026 సంపుటి : 07 సంచిక 332 పేజీలు : 8 వెల : రూ 3-00


# అమరావతి అభివృద్ధిలో మరో ముందడుగు..

## క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్లకు గ్రీన్ సిగ్నల్



అమరావతి, మే2 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా ఏపీ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని ప్రాంతంలోని క్వాంటం వ్యాలీలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించతలపెట్టిన ట్విన్ ఆఫీస్ టవర్ల నిర్మాణానికి అధికారికంగా పరిపాలన అనుమతులు లభించాయి. రాజధాని నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పరిపాలనా యంత్రాంగానికి అవసరమైన కార్యాలయాల కోసం ఈ ట్విన్ టవర్లను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ట్విన్ టవర్ల 'షెల్ అండ్ కోర్' నిర్మాణ పనుల కోసం రూ. 1208.41 కోట్లు కేటాయిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల (ఏప్రిల్) 23వ తేదీన జరిగిన 60వ ఏపీసీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నిధులను మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టును 'డిజైన్ బిల్డ్ లంప్సమ్' పర్సంటేజ్ టెండర్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల నిర్మాణ సంస్థ ప్లానింగ్, డిజైనింగ్, ఎగ్జిక్యూషన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఈ భారీ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టు పర్యవేక్షణ, అమలు బాధ్యతలను ఏజీఐసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. క్వాంటం వ్యాలీ ప్రాంతంలో ఈ టవర్లు రావడం వల్ల ఐటీ, పరిపాలన, వాణిజ్య రంగాలు మరింత వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉంది. అమరావతిని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో ఇవి ఐకానిక్ కట్టడాలుగా నిలవనున్నాయి. అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచిన ఏపీ ప్రభుత్వం రూ. 1208.41 కోట్లకు పైగా నిధులతో ట్విన్ టవర్ల నిర్మాణానికి పచ్చజెండా ఊపడం రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్, అభివృద్ధి పనులకు కొత్త ఊపునిస్తోంది.

# సీపీఐ నేత రామకృష్ణ మాతృమూర్తి మృతిపై ప్రముఖుల సంతాపం



అమరావతి, మే 2: సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మాతృమూర్తి గౌరమ్మ మృతిపట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సంతాపం తెలియజేశారు. గౌరమ్మ మరణవార్త తెలిసిన వెంటనే రామకృష్ణను ఫోన్లో పరామర్శించారు సీఎం చంద్రబాబు. గౌరమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించారు. రామకృష్ణ, వారి కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాతృమూర్తి గౌరమ్మ కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గౌరమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రామకృష్ణ, ఇతర కుటుంబ సభ్యులకు పవన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 'మీ మాతృమూర్తి గౌరమ్మ స్వర్గస్తులయ్యారనే వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. నూరేళ్ల పరిపూర్ణ జీవితాన్ని గడిపి, క్రమశిక్షణ కలిగిన మిమ్మల్ని సమాజానికి అందించిన ఆమె మరణం మీ కుటుంబానికి తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తూ, ఈ కష్ట సమయంలో మీకు, మీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు. సీపీఐ జాతీయ నాయకులు డాక్టర్ కె నారాయణ, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ రఘువీరారెడ్డి తదితరులు.. రామకృష్ణను పరామర్శించి, సంతాపం తెలియజేశారు.

# ఏపీ లిక్కర్ స్కామ్.. రంగంలోకి ఐటీ.. రూ.2000 కోట్లపై ఫోకస్

అమరావతి, మే 2: ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. లిక్కర్ స్కామ్ ద్వారా సుమారు రెండు వేల కోట్ల రూపాయల అక్రమ సంపాదనపై ఐటీ ఫోకస్ పెట్టింది. రూ. 2000 కోట్లకు సంబంధించిన ట్యాక్స్ వివరాలను ఐటీ సేకరించే పనిలో పడింది. త్వరలోనే పలువురు నిందితులకు నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం. అక్రమంగా సంపాదించిన డబ్బును ఒకచోట నుంచి మరోచోటికి తరలించడానికి హవాలా మార్గాన్ని ఎంచుకున్నట్లు ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. డబ్బు తరలింపు విధానంపై ఐటీ బృందం ప్రత్యేక దృష్టి సారించింది. హవాలా ద్వారా నిధులను దుబాయ్‌కు తరలించినట్లు ఐటీ గుర్తించింది. నెలకు 50 నుంచి 60 కోట్ల రూపాయల అక్రమ నగదు జనరేట్ చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. డిస్టిలరీల నుంచి వెండర్లకు ఐదు రెట్లు ఎక్కువ చెల్లింపులు చేసినట్లు గుర్తించింది. ఎలాంటి మెటీరియల్ సరఫరా చేయకుండానే రెండు డిస్టిలరీలు ఫేక్



ఇన్‌వాయిస్‌లు సృష్టించి 76.92 కోట్ల రూపాయలను తరలించినట్లు దర్యాప్తులో బయటపడింది. డిజిటల్ ట్రైల్‌ను తప్పించుకోవడానికే మొత్తం లాభాలను బ్లాక్ మనీగా దాచిపెట్టినట్లు ఐటీ గుర్తించింది.

# సుప్రీంకోర్టులో టీఎంసీకి ఎదురుదెబ్బ..

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల (ఖూజ) ఉద్యోగులను మాత్రమే ఎలక్షన్ కమిషన్ నియమించడాన్ని సవాలు చేస్తూ టీఎంసీ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టు తీర్పును టీఎంసీ సుప్రీంకోర్టులో సవాలు చేసిందిటీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జయమాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం తాజాగా విచారించింది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా తమకు వ్యతిరేకంగా వెళ్తారనే టీఎంసీ వాదన సరికాదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులపై విశ్వాసం ఉంచాలని సూచించింది. పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ జారీ చేసిన సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా లేదని పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారని వివరించింది.

# స్వచ్ఛ రథాలకు నేచురల్ స్టార్ నాని సహాయం.. స్పందించిన డిప్యూటీ సీఎంవో..

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 'స్వచ్ఛరథాలు' కార్యక్రమానికి ప్రముఖ సినీ హీరో, నేచురల్ స్టార్ నాని సహాయం చేయడంపై ఉప ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. నాని సహాయంపై ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. అడిగిన వెంటనే సాయం చేయడంపై ప్రశంసలు కురిపించింది.'మన పారిశుద్ధ్యం.. మన ఆరోగ్యం.. మన బాధ్యత' అనే నినాదంతో పవన్ ఆలోచనల నుంచి స్వచ్ఛరథాలు పురుడుపోసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఈ స్వచ్ఛరథాలు విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. చెత్త నుంచి సంపద సృష్టి అనే యజ్ఞంలో గ్రామీణ ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ దూసుకుపోతున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన స్వచ్ఛరథాల గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అడిగిన వెంటనే తన వంతు సహాయ సహకారాలు అందించిన ప్రముఖ హీరో నానికి పవన్ కల్యాణ్ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఈ స్వచ్ఛరథాలు ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో సుమారు 19 లక్షల కేజీల పొడి చెత్త కొనుగోలు చేయడం ద్వారా రూ. 3.32 కోట్ల విలువ గల నిత్యావసరాలను ప్రజలకి అందించాయని చెప్పేందుకు ఆనందిస్తున్నాం. గ్రామాల్లో పారిశుద్ధ్య ఉద్యమం పట్ల ప్రజల్లో పెంపొందుతున్న అవగాహనకు ఇది నిదర్శనం. భవిష్యత్తు తరాలకు వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం పాఠశాలల వద్దకు ఈ స్వచ్ఛరథాలు వెళ్లి.. పొడి చెత్తకు బదులుగా పుస్తకాలు, స్టేషనరీ ఇచ్చే విధంగా చేసిన ఏర్పాటు సత్ఫలితాలను ఇస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు ఈ స్వచ్ఛరథం కార్యక్రమాన్ని ప్రారంభించాం' అని డిప్యూటీ సీఎంవో ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది.






# సంపాదకీయం

ఆదివారం 03-05-2026

## ఉపశమనమా లేక దీర్ఘకాల అభివృద్ధా?

దేశంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉచితాలు అనే పదం రాజకీయాల్లో ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి పార్టీ కూడా ప్రజలను ఆకర్షించడానికి కొత్త కొత్త పథకాల పేరుతో ఉచితాలు ప్రకటిస్తోంది. ఉచిత విద్యుత్, ఉచిత డబ్బు పంపిణీ, ఉచిత గ్యాస్, ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలు ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని ఇస్తున్నట్టే కనిపిస్తున్నాయి. కానీ ఈ ఉచితాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? నిజంగా ఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయా? లేక ఓట్లు సాధించడానికి ఒక రాజకీయ వ్యూహమా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా ఉత్పన్నమవుతున్నాయి. ఉచితాలు ఇవ్వడం అంటే తప్పు అని ఒకే పదంతో చెప్పలేం. ఎందుకంటే కొన్ని సందర్భాలలో ప్రభుత్వ జోక్యం అవసరం అవుతుంది. ఉపశమనా లేక దీర్ఘకాల అభివృద్ధా? ఈ రెండు మధ్య ఉన్న సున్నితమైన తేడాను గుర్తించకపోతే, ప్రజాస్వామ్యం స్వయం గా దారితప్పే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మనం చూస్తున్న పరిస్థితి కూడా అదే. పేదరికం, ఆకలి, ఆరోగ్య సమస్యలు, విద్య లోపం వంటి అంశాలలో ప్రభుత్వం సహాయం చేయడం సమాజానికి అవసరం. ఉదాహరణకు, పేద విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఉచిత వైద్యం వంటి పథకాలు సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే పునాది లాంటివి. ఇవి ఒక దేశ అభివృద్ధికి అవసరమైన మౌలిక హక్కులు. కానీ అదే సమయంలో ప్రతి అంశాన్ని ఉచితంగా మార్చడం, ప్రతి అవసరాన్ని ప్రభుత్వంపై ఆధారపడి తీర్చుకోవడం ఒక ప్రమాదకర దిశగా తీసుకెళ్తుంది. ఉచితాల రాజకీయాలు తాత్కాలికంగా ప్రజలకు ఆనందాన్ని ఇస్తాయి. ఎన్నికల సమయంలో ఇది మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారీ సమస్యలతో బాధపడుతున్నప్పుడు, అతనికి తక్షణ ఉపశమనాన్ని ఇచ్చే ఏ పథకమైనా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ దీర్ఘకాలంలో ఈ పథకాల ప్రభావం ఎలా ఉంటుందో చాలా మంది ఆలోచించరు. ఒక సమాజం నిరంతరం ఉచితాలపై ఆధారపడితే, క్రమంగా కష్టపడి సంపాదించే భావన తగ్గిపోతుంది. స్వయం సమర్థత క్షీణిస్తుంది. వ్యక్తి తన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించకుండా, ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది. యువత అనేది ఒక దేశానికి బలం. వారి కృషి, ఆలోచనలు, సృజనాత్మకత దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ అదే యువత ఉచితాలవల్ల అలసత్వానికి లోనైతే, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. చదువుకున్న యువకులు కూడా తమకు తగిన అవకాశాలు దొరకక చిన్న చిన్న ఉద్యోగాలలోనే నిలిచిపోతున్నారు. ఇది కేవలం వారి వైఫల్యం కాదు. ఇది ఒక వ్యవస్థలోని లోపం. విద్యావ్యవస్థ సరైన నైపుణ్యాలను అందించకపోవడం, పరిశ్రమల అభివృద్ధి లేకపోవడం, ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేకపోవడం, ఈ కారకాలన్నీ కలిసి ఈ పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఆర్థిక పరిపాలన. ఒక ప్రభుత్వం ఉచితాలు ప్రకటించడానికి ముందు, ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకుంటుందో ఆలోచించాలి. ఆదాయం లేకుండా ఖర్చులు పెంచితే, అప్పులు తప్పవు. అప్పులు పెరిగితే, భవిష్యత్ తరాలపై భారమవుతుంది. ఈ రోజు తీసుకునే నిర్ణయాలు రేపటి తరాలకు ప్రభావం చూపుతాయి. కానీ ఎన్నికల రాజకీయాల్లో ఈ దీర్ఘకాల ఆలోచన చాలా సందర్భాల్లో కనిపించదు. తక్షణ ప్రయోజనాల కోసం భవిష్యత్తును తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే చాలా చోట్ల అప్పులు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వంపై నిందలు వేయడం ఒక సాధారణ ధోరణిగా మారింది. వాళ్లు అప్పులు చేసి వెళ్లారు అనే వాదన వినిపిస్తుంది. కానీ అదే సమయంలో కొత్తగా కూడా అప్పులు తీసుకుంటూ ఉచిత పథకాలను కొనసాగించడం ఒక విరుద్ధమైన పరిస్థితి. ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రభుత్వాన్ని కేవలం హామీల ఆధారంగా కాకుండా, ఆ హామీలను అమలు చేసే సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక శక్తి. ఆ శక్తిని ఎలా ఉపయోగించాలో ప్రజలపై ఆధారపడి ఉంటుంది. ఒక ఓటు ద్వారా మనం ఒక ప్రభుత్వాన్ని ఎంచుకుంటాం. ఆ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఓటు వేసేటప్పుడు తక్షణ ప్రయోజనాలను కాకుండా, దీర్ఘకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి. ఉచితాలు ఇచ్చే పార్టీని కాకుండా, అవకాశాలు సృష్టించే పార్టీని ఎంచుకోవాలి. ఇక్కడ విద్య, ఆరోగ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇవి ఉచితంగా అందించాల్సిన అత్యవసర రంగాలు. ఎందుకంటే ఒక వ్యక్తి చదువుకున్నప్పుడు, అతను తన జీవితాన్ని మార్చుకునే సామర్థ్యాన్ని పొందుతాడు. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అతను సమాజానికి ఉపయోగపడగలడు. కాబట్టి ఈ రెండు రంగాలలో పెట్టుబడి పెట్టడం ఖర్చు కాదు, అది ఒక పెట్టుబడి. ఇది దేశ భవిష్యత్తును నిర్మించే పునాది. అదే సమయంలో మిగతా రంగాలలో ఉచితాల కంటే అవకాశాలు ఇవ్వడం ముఖ్యమైనది. ఉద్యోగాలు సృష్టించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు సమాజాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్తాయి. ఒక రైతుకు ఉచిత డబ్బు ఇవ్వడం కంటే, అతనికి సరైన ధర, నీరు, మార్కెట్ ఇవ్వడం ఎక్కువ ప్రయోజనకరం. ఒక యువకుడికి ఉచిత సబ్సిడీ ఇవ్వడం కంటే, అతనికి ఉద్యోగం లేదా వ్యాపారం చేసే అవకాశాన్ని కల్పించడం ఉత్తమం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే, హామీలు ఇవ్వడం చాలా సులభం. కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోవడం ప్రజల్లో నిరాశను కలిగిస్తుంది. ఇది ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒక నాయకుడు చెప్పిన మాట నిలబెట్టుకోకపోతే, ప్రజలు రాజకీయ వ్యవస్థపై విశ్వాసం కోల్పోతారు. ఇక ప్రజల పాత్ర గురించి మాట్లాడితే, మార్పు ఎక్కడి నుండి వస్తుంది అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఉంది

## ఓఆర్ఆర్‌పై యాక్సిడెంట్‌లో సిరిసిల్ల వాసులు మృతి.. పార్థివదేహాలకు కేటీఆర్ నివాళులు


హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి



లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్‌సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనానికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్ఆర్‌పై 16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుంచి మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. ఈ ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాతపడ్డారు. కోడం తేజశ్రీ(శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. అనంతరం కిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కొడుకు, కోడలు, అల్లుడి కుటుంబాలు మృత్యువాతపడటంతో తీవ్ర విషాదం నెలకొన్నది. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ యోగేశ్‌గౌతం ఘటనాస్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అలసిపోయి రెప్పవాల్చడంతో వేగంగా వెళ్లి కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటుందని డీసీపీ వెల్లడించారు. దర్యాప్తులో ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. సూర్యాపేట నుంచి నూకల లోడ్‌తో నంద్యాలకు వెళ్తుండగా లారీపై ఉన్న తాడిపత్రి సరిగాలేకపోవడంతో, సరిచేసేందుకు పక్కకు ఆపుకొన్నట్టు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. తాను డ్రైవింగ్ సీట్‌లోనే ఉన్నానని, క్లీనర్ లారీపైకి ఎక్కి తాడిపత్రి సరిచేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు.. లారీని ఢీకొట్టిందని వెల్లడించారు.

## పశ్చిమ బెంగాల్ ఫాల్టాలో ఉద్రిక్తత.. టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారంటూ స్థానికుల ఫిర్యాదు

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. టీఎంసీ గూండాలు తమను బెదిరిస్తున్నారంటూ సౌత్ 24 పరగణాస్ జిల్లాలోని ఫాల్టాలో స్థానికులు ఆందోళన బాటపట్టారు. అంతేకాదు, తమ ప్రాంతంలో రీపోలింగ్ నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్‌ను మోహరించి, తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫాల్టాలో స్థానికులు రోడ్లు, వీధుల్లోకి వచ్చి ఆందోళన నిర్వహిస్తున్నారు. దీనిపై స్పందించిన స్థానిక అధికారులు భద్రతను పెంచారు. సీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ దళాల్ని మోహరించారు. శాంతి భద్రతల్ని పర్యవేక్షించేందుకు అనేక చోట్ల సీఆర్పీఎఫ్ వాహనాలు కొలువుదీరాయి. టీఎంసీ నేతలు, గూండాల బెదిరింపుపై మహిళలు వీధుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారు పొరపాటున గెలిస్తే తమ ఇండ్లను దహనంచేయడం ఖాయమని, రక్తపాతం తప్పదని ఒక మహిళ వ్యాఖ్యానించింది. టీఎంసీకి చెందిన ఇస్రాఫిల్ చౌకిదార్ తమను బెదిరిస్తున్నాడని, తాము టీఎంసీకి ఓటేసినప్పటికీ వేధింపులు తప్పడం లేదని మరో మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. టీఎంసీ చౌకిదార్‌ను అరెస్టు చేసి, తమకు రక్షణ కల్పించాలని పలువురు మహిళలు కోరారు. మరో గ్రామంలో స్థానిక టీఎంసీ నేత బైకులపై వచ్చి తమను బెదిరించారని తెలిపారు. వాళ్లు తమ గ్రామంపై దాడి చేసి, హత్యలు చేసే అవకాశం కూడా ఉందని వారు అంటున్నారు. ఒక పక్క బెంగాల్‌లో భారీ స్థాయిలో కేంద్ర



బలగాలు మోహరించినప్పటికీ అనేక చోట్ల హింస, ఆందోళనలు ఆగడం లేదు. పశ్చిమ బెంగాల్‌లోని ఒక స్ట్రాంగ్ రూమ్‌ను అనుమతి లేకుండా కొందరు తెరిచారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో ఆరుగురు అధికారుల్ని ఈసీ సస్పెండ్ చేసింది. మే 4, సోమవారం ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి.

## మందుపాతరను నిర్వీర్యం చేస్తుండగా పేలుడు.. ముగ్గురు జవాన్‌లు దుర్మరణం

ఛత్తీస్‌గఢ్ లో ఘోరం జరిగింది. గతంలో మావోయిస్టులు అమర్చిన శక్తిమంతమైన మందుపాతర ను గుర్తించి నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుండగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ కి చెందిన ముగ్గురు జవాన్‌లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు.



మందుపాతరలు తొలగించే ఆపరేషన్ నిర్వహిస్తుండగా మధ్యాహ్నం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్-నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో భద్రతా బలగాలు డీమైనింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్‌లు చేపట్టాయి. అందులో భాగంగా ఛోటే బేతియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ బృందం మావోయిస్టులు అమర్చిన బాంబులను గుర్తించి నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ఒక ఐఈడీ ఊహించని విధంగా పేలింది. ఈ పేలుడులో ఇన్‌స్పెక్టర్ సుఖ్‌రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కోమ్రా, మరో కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలే అక్కడికక్కడే మృతి చెందారు. మరో కానిస్టేబుల్ పర్మానంద్ కోమ్రా తీవ్రంగా గాయపడగా అతనికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం స్పందించారు. ఇటీవలి కాలంలో లొంగిపోయిన మావోయిస్టులు, నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా వందలాది ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేశామని చెప్పారు. కానీ ఇవాళ దురదృష్టవశాత్తు ఓ ఐఈడీని నిర్వీర్యం చేస్తుండగా పేలిందని తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల కోసం డీఆర్‌జీ దళాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కాగా మార్చి 31న రాష్ట్రాన్ని సాయుధ మావోయిస్టు రహిత రాష్ట్రంగా ప్రకటించారు. ఆ తర్వాత ఇదే మొదటి పేలుడు ఘటన కావడం గమనార్హం.

## రికార్డు స్థాయికి తెలంగాణ ఆదాయం

### ఏప్రిల్‌లో 35% వృద్ధి దూసుకుపోయిన జీఎస్టీ వసూళ్లు!

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అత్యధిక వసూళ్లను నమోదు చేస్తూ చరిత్ర సృష్టించింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ (ఊు) వసూళ్లలో 35 శాతం భారీ వృద్ధి నమోదైనట్లు వాణిజ్య పన్నుల కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ చరిత్రలోనే అత్యధికంరాష్ట్రానికి ఏప్రిల్ 2026లో ఏకంగా రూ. 4,621 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే నెలలో ఈ మొత్తం రూ. 3,433 కోట్లుగా ఉండగా, ఇప్పుడు అదనంగా రూ. 1,188 కోట్లు వసూలైంది. జీఎస్టీ వ్యవస్థ అమలులోకి వచ్చినప్పటి నుండి ఒక నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం ఇదే మొదటిసారి.

## ‘ప్రభుత్వం రైతు డిక్లరేషన్‌ను అమలు చేయాలి’



కోదాడ, మే 02 : వరంగల్ వేదికగా కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్ ను ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్ఎస్ కోదాడ పట్టణ అధ్యక్షుడు ఎస్.కె నయీమ్ డిమాండ్ చేశారు. శనివారం కోదాడ పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మే 6న బీఆర్ఎస్ పార్టీ వరంగల్ లో నిర్వహించనున్న రైతు సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ఎన్నికల్లో హామీలు ఇచ్చి ప్రజలను వంచించి గెలిచిందని విమర్శించారు. ఇప్పుడు హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిందన్నారు. తెలంగాణ వార్తలుఉద్యమ నేత కేసీఆర్ రైతు బాంధవుడు అన్నారు. రైతులను రాజును చేసేందుకు రైతు బంధు, రైతు బీమా, ఎరువులు, చివరి ఆయకట్టు భూములకు సాగునీరు, పలు పంటలకు బోనస్ అందించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలవడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పయిడిమర్రి సత్యబాబు, కౌన్సిలర్ చీమ నరేష్, నాయకులు ఇమ్రాన్ ఖాన్, శ్రీనివాస్, పిట్టల భాగ్యమ్మ, గోపాల్, కరీముల్లా, ఉపేందర్, మల్లయ్య గౌడ్, చారి, అలీమ్, నిస్సార్, జానీ, దస్తగిరి, ఆసిఫ్, లక్ష్మయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊరేగింపుగా పెళ్లికి వెళ్తున్న వరుడు.. కాల్పులు జరిపి హత్య



లక్నో: ఒక వరుడు తన బంధువులతో కలిసి ఊరేగింపుగా పెళ్లి వేదిక వద్దకు బయలుదేరాడు. మార్గమధ్యలో కొందరు వ్యక్తులు అతడిపై కాల్పులు జరిపి పారిపోయారు. బుల్లెట్ గాయాలైన వరుడు కారులోనే కుప్పకూలి మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బదౌర్ గ్రామానికి చెందిన 27 ఏళ్ల ఆజాద్ బింద్ శుక్రవారం పెళ్లికొడుకుగా ముస్తాబయ్యాడు. తన బంధువులతో కలిసి ఊరేగింపుగా కారులో పెళ్లి వేదిక వద్దకు బయలుదేరాడు. కాగా, శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ముఖానికి ముసుగులు ధరించిన వ్యక్తులు బైక్‌పై వచ్చారు. బీబీపూర్ గ్రామం సమీపంలో వరుడు ఉన్న కారును అడ్డగించారు. ఆజాద్ బింద్‌పై పలు రౌండ్లు కాల్పులు జరిపి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన పెళ్లికొడుకు ఆ కారులో కుప్పకూలి మరణించాడు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వధువు బంధువైన ప్రియుడు వరుడ్ని హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో వధువు మొబైల్ ఫోన్ కాల్స్ పరిశీలిస్తామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీస్ అధికారి తెలిపారు.

## మా నౌకా దళాలు సముద్రపు దొంగల్లా పనిచేస్తాయ్.. హర్మూజ్‌లో దిగ్బంధనంపై డొనాల్డ్ ట్రంప్

హర్మూజ్ జలసంధి లో ఇరాన్ ఓడరేవుల పై అమెరికా దిగ్బంధనం కొనసాగుతోంది. ఇటీవల ఆ దేశానికి చెందిన నౌకల ను యూఎస్ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దిగ్బంధనాన్ని అమలు చేయడంలో యూఎస్ నౌకాదళాలు సముద్రపు దొంగల్ లా పనిచేస్తాయని అన్నారు. ఇరాన్ (ఎతీజీని) పై కొనసాగుతున్న దిగ్బంధనం అమెరికాకు మంచి వ్యాపారమని ట్రంప్ అన్నారు. తాము నౌకలను సీజ్ చేశామని, సరకు, చమురును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇది అత్యంత లాభదాయకమైన వ్యాపారమని, తాము పైరేట్స్ లాంటి వాళ్లమని వ్యాఖ్యానించారు. తాము ఇరాన్‌తో ఆటలు ఆడటం లేదని, ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నామని అన్నారు. కాగా, అమెరికా దిగ్బంధనంవల్ల ఇరాన్‌కు దాదాపు 4.8 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ. 45 వేల కోట్లకుపైగా) నష్టం వాటిల్లినట్లు పెంటగాన్ అంచనా వేసింది. దిగ్బంధనం అమల్లోకి వచ్చినప్పటి నుంచి చమురుతో సహా ఇతర నిషేధిత సరకులను రవాణా చేసేందుకు ప్రయత్నించిన 40 కిపైగా నౌకలను యూఎస్ దళాలు దారి మళ్లించాయని పెంటగాన్ తెలిపింది. దాంతో సుమారు 53 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురు తీసుకెళ్తున్న 31 ట్యాంకర్లు గల్ఫ్‌లోనే నిలిచిపోయాయని పేర్కొన్నది.



# విద్యారంగం.. లోకేష్ మార్క్...



విజయవాడ, మే 2, ప్రతి రాజకీయ పార్టీకి ప్రజలకు మంచి చేయాలని ఉంటుంది. కానీ విధానపరంగా వెళ్లే క్రమంలో రాజకీయాలు అలుముకుంటాయి. ఒకవైపు ప్రభుత్వ పాలన నడిపిస్తూనే రాజకీయాలు చేస్తేనే పార్టీలు మన గలవు. ప్రభుత్వపరంగా ఏ చిన్న మార్పు కోసం ప్రయత్నం చేసినా.. దాని వెనుక రాజకీయాలు అనేవి వెంటాడుతూనే ఉంటాయి. అయితే రాజకీయాలను పక్కనపెట్టి విద్యావ్యవస్థను సమూల మార్పులు తీసుకురావాలని మంత్రి నారా లోకేష్ భావించారు. ఇందుకు గట్టిగానే అడుగులు వేశారు. వాటికి సంబంధించిన సత్ఫలితాలు వచ్చాయి. పాఠశాల విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ఇప్పటివరకు పత్రిక ప్రకటనలకు కేవలం కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు మాత్రమే పరిమితం అయ్యాయి. తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలను పత్రికల యాడ్ల రూపంలో ప్రచురించారు అంటే.. ప్రభుత్వ విద్య విషయంలో నారా లోకేష్ ఆలోచన ఎలా ఉందో ఇట్టే అర్థం అవుతుంది.మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ పోటీ ప్రపంచంలో తట్టుకోవాలి అంటే.. కచ్చితంగా మెరుగైన విద్యా బోధన ఉండాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాలు కూడా మారాలి. ఇదే ఆకాంక్షను పాఠశాల విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన లోకేష్ బయటపెట్టారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్యా వరకు పాఠ్యాంశాల పునర్నిర్మాణం చేపట్టారు. క్వాంటం టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లాజిస్టిక్స్ వంటి గేమ్ చేంజర్ రంగాల్లో కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా లోకేష్ సరికొత్త మార్పునకు శ్రీకారం చుట్టారు. ఒక విజయంతో పనిచేసి ఎన్సీఈఆర్టీ, ఐఐటి మద్రాస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో సరికొత్త కోర్సులను కూడా రూపొందించారుఒక్క ప్రాథమిక, ఉన్నత విద్య విషయంలో మాత్రమే కాదు.. యూనివర్సిటీల విషయంలో సైతం లోకేష్ ప్రత్యేక ఆలోచనలతో ముందుకు సాగారు. యూనివర్సిటీలు అనేవి కేవలం పరీక్షలు నిర్వహించే కేంద్రాలుగా ఉండకూడదు అనేది ఆయన భావన. సరికొత్త ఆవిష్కరణలకు నిలయంగా మారాలని భావిస్తున్నారు. ప్రతి యూనివర్సిటీని ఒక పారిశ్రామిక సంస్థతో అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థుల్లో అనుభవం లభిస్తుంది అని భావించారు. అందుకే ప్రపంచంలోనే టాప్ 200 యూనివర్సిటీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని లక్ష్యం ఆయనలో కనిపించింది. ఎంతలా అంటే నర్సింగ్, పాలిటెక్నిక్ డిప్లమో వంటివి పూర్తి చేసిన విద్యార్థులకు ఏకంగా జర్మన్, రష్యా వంటి భాష లను నేర్పించి విదేశాల్లో ఉద్యోగాలు లభించే స్థాయికి వారిని తీర్చిదిద్దుతున్నారు అంటే లోకేష్ ఆలోచన ఇట్టే అర్థం అవుతుంది.పాఠశాల విద్యాశాఖ స్వరూపాన్ని మార్చారు. విద్యా బోధనను మార్చారు. పాఠ్యాంశాలను మార్చారు. అంతటితో ఆగలేదు ఆయన ప్రయత్నం. మధ్యాహ్నం భోజనం లో సమూల మార్పులు తీసుకొచ్చారు. పోషకాలతో కూడిన మెనూ, కిచెన్ గార్డెన్లు, డిజిటల్ బోధన ద్వారా పాఠశాల విద్యను మరింత బలోపేతం చేశారు. లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రులకు జవాబుదారీగా ఉండడం.. మరుగుదొడ్ల పరిశుభ్రత వంటి చిన్న అంశాలనుంచి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి పెద్ద అంశాల వరకు.. అన్ని నారా లోకేష్ ఆలోచనలే. వైసీపీ హయాంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వాటిని గాడిలో పెట్టే పనిలో లోకేష్ కొంతవరకు సక్సెస్ అయ్యారు. అయితే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల ఫలితాలను సైతం పత్రికలకు యాడ్ల రూపంలో ఇచ్చారు అంటే.. ప్రభుత్వ విద్యను ఏ స్థాయిలో నిలబెట్టారు అనేది ఇట్టే అర్థమవుతోంది.ఏపీలో ప్రభుత్వ పాఠశాలలు వృద్ధి సాధించాయి. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన స్థానాలను పొందాయి. కార్పొరేట్ తో పాటు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలను సాధించడం విశేషం. సాధారణంగా ఫలితాలు వచ్చిన మరుసటి మీడియా ఫోకస్ అంతా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ప్రకటనలపై ఉండేది. కానీ ఈసారి మాత్రం ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల కంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కూడిన ఫోటోలు పత్రికల్లో కనిపించాయి. భారీ ప్రకటనల రూపంలో ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ స్కూళ్లలో 550 కి పైగా మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలను ప్రభుత్వం గర్వంగా ప్రకటించింది. ఇది కేవలం ఒక ప్రకటన అనుకుంటే పొరపడినట్టే. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే లక్షలాదిమంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు భరోసా.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్నారు నారా లోకేష్. ఆయన చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు ఇస్తున్నాయి. కేవలం ప్రైవేట్ స్కూళ్లకు మాత్రమే పరిమితమైన క్వాలిటీ విద్యను.. ప్రభుత్వ పాఠశాలల్లోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఆయన అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. డిజిటల్ తరగతులు, నాణ్యమైన విద్యా బోధన, నిరంతర పర్యవేక్షణ వంటి చర్యలతో ప్రభుత్వ స్కూళ్లపై ప్రజల్లో నమ్మకం పెంచగలిగారు నారా లోకేష్. ఎగువ మధ్యతరగతి కుటుంబాలు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా మంచి వాతావరణాన్ని సృష్టించగలిగారు. అందుకు అనుగుణంగా పాఠశాలలను తీర్చిదిద్దగలిగారు.వేటు స్కూళ్లతో ప్రభుత్వ స్కూళ్లు పోటీప్రభుత్వ పాఠశాలలంటే కేవలం పేద విద్యార్థులు చదువుకునే చోటు మాత్రమే కాదని, అక్కడ కూడా అత్యుత్తమ విద్యాబోధన అందుతుందని ఈ ప్రకటనలు నిరూపిస్తున్నాయి. భారీ మార్కులు, ర్యాంకులు కేవలం ఏసీ గదుల్లో చదివితేనే రావు.. నిబద్ధత గల ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు ఉంటే ప్రభుత్వ బడిలోనూ స్టేట్ టాపర్స్ తయారవుతారని విద్యాశాఖ ఈ ప్రచారంతో స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా, సామాన్య ప్రజల్లో ప్రభుత్వ విద్యావ్యవస్థపై ఉన్న చిన్నచూపును తొలగించి, నమ్మకాన్ని పెంపొందించడానికి ఇవి దోహదపడుతున్నాయి. గతంలో ప్రైవేటు స్కూళ్లలో మార్కులు రావడానికి కారణం వారి విద్యా విధానమే అన్న భ్రమలో తల్లిదండ్రులు ఉండేవారు. కానీ, నేడు ప్రభుత్వ స్కూళ్లలో డిజిటల్ తరగతులు, మెరుగైన మౌలిక సదుపాయాలు మరియు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల కృషి ఫలితంగా మార్కులు వస్తున్నాయని ప్రభుత్వం గట్టిగా చెబుతోంది. తమ పిల్లల ఫోటోలను ఇలా అధికారిక ప్రకటనల్లో చూసుకోవడం ఆ తల్లిదండ్రులకు జీవితకాలపు గర్వకారణంగా మారుతోంది. ఇది ఇతర విద్యార్థుల్లో కూడా పోటీ తత్వాన్ని, తాము కూడా సాధించగలమన్న ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది.ఈ ప్రయత్నం కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితం కాకుండా, ఒక సామాజిక మార్పుకు నాంది పలుకుతోంది. ప్రైవేటు సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వ బడులే శరణ్యమని భావించేలా చేస్తోంది. విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై మేధావులు, విద్యావేత్తల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. కేవలం అధికారుల మీదనే ఫోకస్ పెట్టకుండా, క్షేత్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం ద్వారా అటు ఉపాధ్యాయులను, ఇటు విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించినట్లు అయింది.వాస్తవానికి గత ఏడాదికంటే పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత ఏడాది కంటే 4.15% ఉత్తీర్ణత నమోదు పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 5,26,954 మంది ఉత్తీర్ణత సాధించారు. 83.69 శాతం మంది ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణులయ్యారు. బాలుర కంటే బాలికలే టాప్ గా నిలిచారు. 2161 పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత నమోదయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం అందర్నీ ఆకట్టుకుంది. పాఠశాల విద్యాశాఖలో తీసుకున్న చర్యలతోనే ఇది సాధ్యమైంది.

# దక్షిణాది పై జనసేన కన్ను...

విజయవాడ,మే 2, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగి, అధికారంలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, ఇప్పుడు తెలుగ స్టేట్స్‌ను దాటి జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేస్తోంది. పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు ఒక్కో అడుగు ముందుకు పడుతోంది. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు, పార్టీ సెక్రటరీ రామ్ తాళ్లూరికి పార్టీ విస్తరణ బాధ్యతలు అప్పగించారు పవన్. ఇప్పటికే కేరళ, కర్ణాటకలో సమావేశాలు పెట్టారు. త్వరలో తమిళనాడులోనూ సమావేశం ఏర్పాటు చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అయితే ఆయా రాష్ట్రాల్లో జనసేన విస్తరణకు డిమాండ్ వస్తుందని అక్కడి ప్రజలు నాయకులు జనసేనను కోరుకుంటున్నారని చెబుతున్నారు. పక్క రాష్ట్రాల్లో పార్టీ విస్తరణ సన్నాహాలపై పార్టీ నేతల్లో సీరియస్ చర్చ జరుగుతుందట. రాజకీయంగా పార్టీకి మంచి భవిష్యత్ ఉన్న ఏపీలో సీరియస్ ఫోకస్ చేయకుండా పక్క రాష్ట్రాల్లో జనసేన సమావేశాలు ఎందుకనే చర్చ జరుగుతోందట.జనసేన పార్టీ ప్రస్తుతం ఏపీ ఎన్డీయే కూటమిలో భాగస్వామ్యంగా ఉంది. పార్టీ పెట్టి 12 ఏళ్లయినా..ఆంధ్రప్రదేశ్‌లో ఇంకా పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదు. గత ఎన్నికల్లో 21 అసెంబ్లీ సీట్లలో మాత్రమే పోటీ చేసి..ఆ 21 సీట్లలో గెలిచింది జనసేన. ఇంకా అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగితే..ఇక్కడే పార్టీ బలోపేతం కోసం ఎన్నో వ్యూహాలు రచించాల్సి ఉంది. పైగా ఇప్పుడు కూటమిలో ఉన్నా..ఎప్పుడో ఓసారి జనసేన సొంతంగా పోటీ చేసే పరిస్థితి రావొచ్చని..అప్పుడు అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసేలా ప్రణాళికలు ఉండాలని కోరుకుంటున్నారు జనసేన కార్యకర్తలు.ఏపీలో ఉత్తరాంధ్ర టు రాయలసీమ వరకు అన్ని ప్రాంతాల్లో పార్టీ బలోపేతం చేసే దిశగా ప్రయత్నాలు చేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారు. అయితే ఇప్పుడు సభ్యత్వ నమోదు కొనసాగుతున్నా..రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు పూర్తి కాలేదు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కమిటీలు అనుబంధ విభాగాలు అంటూ హడావిడి జరుగుతున్నా ఆచరణలో పెట్టడం లేదనేది ఆ పార్టీ నేతల్లో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. అధికారంలో ఉన్నప్పుడే ఏపీలో పార్టీని పటిష్టం చేస్తే బాగుంటుందని సీనియర్లు సూచిస్తున్నారట. కానీ పార్టీ అధిష్టానం మాత్రం ఏపీని కాదని..కేరళ, కర్ణాటక, తమిళనాడులో విస్తరించేలా సమావేశాలు పెట్టడం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. అధిష్టానం పెద్దలు మాత్రం ఈ విస్తరణ వెనుక వ్యూహం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారట. ఏపీలో అయినా..ఏ స్టేట్‌లో అయినా కింగ్ మేకర్‌గా ఉండాలన్నదే ప్లాన్‌గా చర్చించుకుంటున్నారు జనసేన లీడర్లు.పవన్ కల్యాణ్ తన బాల్యం, విద్యాభ్యాసం, సినిమాల్లోకి రాకముందు ఎక్కువ కాలం చెన్నైలోనే గడిపారు. దీంతో ఆయనకు అక్కడి సామాజిక, రాజకీయ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందని చెబుతున్నారు. తమిళ సినీ పరిశ్రమతో పాటు రాజకీయ ప్రముఖులతో పవన్‌కు ఉన్న వ్యక్తిగత సంబంధాలను పార్టీ బలోపేతానికి వాడుకోవాలని జనసేన భావిస్తోందట.. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పవన్‌కు అభిమాన గణం ఉంది. ఈ క్రేజ్‌ను ఓటు బ్యాంకుగా మలిచే వ్యూహంతో పార్టీ ముందుకు వెళ్తోందట.జనసేన విస్తరణ మాస్టర్ ప్లాన్ కేవలం ఒకట్రెండు రాష్ట్రాలకే పరిమితం కాదని అంటున్నాయి పార్టీ వర్గాలు. ఇప్పటికే కేరళలో యూనిట్ పనులు ప్రారంభం కాగా, త్వరలో తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో కూడా పార్టీ యాక్టివిటీ స్టార్ట్ చేయనున్నారట. సౌత్‌లో పట్టు సాధించిన తర్వాత, ఉత్తరాది రాష్ట్రాలపై కూడా దృష్టి పెట్టబోతున్నారట.

# కనిపించని వైసీపీ నేతలు

తిరుపతి, మే 2,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. నెక్స్ట్ మేమే అంటూ నేతలు ప్రకటనలు చేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకు ఇదే మాట చెబుతున్నారు. కానీ ప్రభుత్వ వైఫల్యాలపై మాత్రం ప్రశ్నించే నేతలు కరువవుతున్నారు. ఒకరిద్దరు



నేతలు మాత్రమే స్పందిస్తున్నారు. విశాఖలో ఏదైనా పరిణామం జరిగితే గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతున్నారు. మిడిల్ ఆంధ్రాలో ఏదైనా జరిగితే అంబటి రాంబాబు, పేర్ని నాని లాంటి నేతలు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. రాయలసీమలో ఏమైనా జరిగితే నెల్లూరు జిల్లాకు చెందిన కాకాని గోవర్ధన్ రెడ్డి మీడియా ముందుకు వస్తున్నారు. మధ్యలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రెస్ మీట్ పెట్టి కొన్ని అంశాలపై స్పందిస్తున్నారు. వారికి మించి ఎవరు ముందుకు రావడం లేదు. నిజంగా ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోటు. గత కొద్దిరోజులుగా రాష్ట్రంలో డీజిల్ అంశంపై పోరాటం చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ ప్రధాన నేతలు ఎవరు దీనికి హాజరు కాలేదు. పేరు మోసిన నాయకులు కనిపించలేదు. వారంతా వీకెండ్ కామెంట్స్ అన్నట్టు వారంలో ఒకసారి మీడియా ముందుకు వచ్చి మళ్లీ సైలెంట్ అవుతున్నారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారు. కుటుంబంతో సహా ఆయన మే 15 వరకు విదేశీ పర్యటనలోనే ఉంటారు. ఇంతలో రాష్ట్రంలో డీజిల్ కొరత ఏర్పడింది. దీనిపై ఆందోళనలు చేపట్టాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే ఒకటి రెండు చోట్ల మాత్రమే సీరియస్ గా దీనిపై ఆందోళన జరిగింది. చాలాచోట్ల తూతూ మంత్రంగా ముగించారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు ఆ పార్టీకి డ్యామేజ్ చేశాయి. దీనిపై ముందుగానే మేల్కొన్నారు చంద్రబాబుతో పాటు లోకేష్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనవసరంగా సృష్టించిన వివాదం అంటూ తిరిగి కౌంటర్ ఇవ్వడం ప్రారంభించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ఆరోపణల కంటే.. చంద్రబాబు కౌంటర్ ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. ఇదంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సృష్టి అని అర్థం వచ్చేలా పరిస్థితి మారింది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంది అనేది ఆ పార్టీ నాయకత్వం నమ్మకం. కానీ ఆ పార్టీలో ఎవరు మాట్లాడుతున్నారు. ప్రభుత్వ చర్యలపై ఎవరు స్పందిస్తున్నారు. ఎక్కడికి అక్కడే నాయకులు తమ సొంత నియోజకవర్గాల్లో చిన్నపాటి కార్యక్రమాలు నిర్వహించి మమ అనిపించేస్తున్నారు. పెద్ద నాయకులు వీకెండ్ పేరిట బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో తలదాచుకుంటున్నారు. అంతకుమించి ఏమీ కనిపించడం లేదు కూడా. కానీ నెక్స్ట్ వచ్చేది మేమే అంటూ మాత్రం ప్రకటనలు చేస్తున్నారు. అధికారం ఉన్నప్పుడు అన్ని అనుభవించి.. ఇప్పుడు మాత్రం మొఖం చాటేస్తున్నారు.. ఏదో పార్టీలో ఉన్నాం అంటే ఉన్నాం అన్నట్టు మారిపోయారు వాళ్లు. ప్రభుత్వంపై విమర్శలు చేసే క్రమంలో చాలామంది నేతలు నవ్వుల పాలు అవుతున్నారు. తిరిగి కూటమి ప్రభుత్వానికి అస్త్రాలు అందిస్తున్నారు.

# ప్రజాభిప్రాయ సేకరణ స్టార్ట్...

గుంటూరు ,మే 2,2029 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభించారు. ముఖ్యమంత్రిగా వివిధ సమావేశాలు, సభలకు హాజరవుతుంటారు చంద్రబాబు. ఈ సందర్భంగానే ఆ ప్రాంత నియోజకవర్గ ఎమ్మెల్యే పనితీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటానని చంద్రబాబు ప్రకటించారు. శుక్రవారం రోజున కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కలలో చంద్రబాబు పర్యటించారు.వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు అంతర్గత సర్వేల ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్నారు చంద్రబాబు. పనితీరు సరిగా లేని ఎమ్మెల్యేలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. ప్రజల్లోకి మరింతగా వెళ్లాలని, ప్రజా క్షేత్రంలో ఉండాలంటూ సూచనలు, సలహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలను కూడా నిర్వహించారు. అయితే ఎమ్మెల్యేల పనితీరుపై ఇక నుంచి నేరుగా ప్రజల నుంచే అభిప్రాయాలు తెలుసుకోవాలని భావిస్తున్నారు.

# రిజర్వుడు నియోజకవర్గాల్లో వైసీపీ చెల్లా చెదురు

ఏలూరు,మే 2, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రాజకీయాల్లో వైసీపీ పరిస్థితి ఎలా ఉన్నా..మూడు రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో మాత్రం రివర్స్ మోడ్‌లో ఉందట. కార్యకర్తకు అండగా ఉండాల్సిన ఇంచార్జ్‌లు..నియోజకవర్గంవైపు చూడకపోవడంతో క్యాడర్ రగిలిపోతోందట. గెలిచినప్పుడు నీడలా ఉన్న నేతలు, ఓడిపోయాక కనీసం కనిపించకపోవడంపై కార్యకర్తలే గుర్రుగా ఉన్నారట. చింతలపూడి నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్న కంభం విజయరాజు ఎక్కడంటే..ఏలూరులో..నివాసం ఉంటున్నారట. అప్పుడప్పుడు నియోజకవర్గ ప్రజలకు, వైసీపీ కార్యకర్తలకు గెస్ట్ అప్పియరెన్స్ ఇస్తున్నారట. చింతలపూడిలో కార్యకర్తపై ఏదైనా కేసు అయినా, సమస్య వచ్చినా.. ఆయన కోసం ఏలూరు దాకా పరుగెత్తాల్సి వస్తోందట. కార్యకర్తలు అనేక సందర్భాల్లో మొరపెట్టుకున్నా అధిష్టానం పెద్దలు కూడా చక్కదిద్దలేదంటున్నారు.ఇక మాజీ మంత్రి తానేటి వనిత తీరు మరీ విచిత్రం అంటున్నారు. ఆమె గోపాలపురం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్. మేడమ్ గారు ఉండేది మాత్రం తాడేపల్లిగూడెంలో అంటున్నారు క్యాడర్. అధికారంలో ఉన్నప్పుడు కొవ్వూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా పనిచేసిన వనిత..ఆ తర్వాత గోపాలపురం నియోజకవర్గంపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో అక్కడి నుంచే పోటీ చేసి ఓడిపోయారు. ఎన్నికల టైమ్‌లో గోపాలపురం నియోజకవర్గంలో కలియ తిరిగిన వనితమ్మ, ఇప్పుడు మాత్రం డిస్టెన్స్ మెయింటైన్ చేస్తున్నారట. ఏదైనా సమస్య వస్తే మేడమ్ కోసం తాడేపల్లిగూడెం వెళ్లినా..అక్కడ అందుబాటులో ఉంటారో లేదోనన్న గ్యారంటీ లేదని నియోజవర్గ కార్యకర్తలే బహిరంగ విమర్శలు చేస్తున్న పరిస్థితి. దీంతో గోపాలపురంలో ఇప్పటికే కొందరు వైసీపీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నేతలు..కూటమి పార్టీల్లోకి వెళ్లిపోగా మరి కొంతమంది అదే దారిలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై పార్టీ అధిష్టానం దృష్టికి కొంతమంది నియోజకవర్గ నేతలు తీసుకెళ్లిన ఆశించిన రెస్పాన్స్ రాలేదంటున్నారు.మరోవైపు కొవ్వూరు నియోజకవర్గం ఇంచార్జ్ తలారి వెంకట్రావు తీరు కథ కూడా అంతే అంటున్నారు. ఈయన కొవ్వూరు నాయకుడు. కానీ, నివాసం మాత్రం గోపాలపురం నియోజకవర్గంలో ఉంటున్నారట. పని పడితే కార్యకర్తలు కొవ్వూరు వెళ్లాల్సి వస్తోందట. కిలోమీటర్ల ప్రయాణం..చేసి వెళ్లిన చివరకు నిరాశే మిగులుతుందట. 2019లో గోపాలపురం నియోజకవర్గం ఎమ్మెల్యేగా పనిచేసిన వెంకటరావుపై నియోజకవర్గంలో వ్యతిరేకత ఉందని పార్టీ అధిష్టానం ఆయన్ను కొవ్వూరుకు పంపి అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న వనితను గోపాలపురం నియోజవర్గానికి తీసుకొచ్చి పోటీ చేయించారు. ఇద్దరు నేతలు ఓడిపోగా..తర్వాత కార్యకర్తలకు అందుబాటులో ఉండటం లేదనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే జిల్లాలో తాడేపల్లిగూడెం వైసీపీ ఇంచార్జ్‌ని మారుస్తారట. అప్పుడే ఈ మూడు నియోజకవర్గాల్లో అందుబాటులో ఉండే నేతలకే ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందంటున్నారు నేతలు.

# ఏసీబీ కోర్టులో కల్తీ నెయ్యి విచారణ షురూ...

నెల్లూరు,మే 2, కల్తీ నెయ్యి ఎపిసోడ్. స్పెషల్ సిట్ రిపోర్ట్ ఎప్పుడో వచ్చింది. అప్పుడే జరగాల్సినంత దానికంటే ఎక్కువే రచ్చ జరిగింది. వైసీపీ వర్సెస్ కూటమి..సోషల్ మీడియా ఫైట్..డైలాగ్ వార్ నెక్స్ట్ లెవల్ హీట్‌ను క్రియేట్ చేసింది. అంతటితో ఇష్యూకు ఫుల్ స్టాప్ పడ్డట్లే అనుకుంటుండగా.. ఏకసభ్య కమిషన్ అంటూ ఏపీ సర్కార్ ట్విస్ట్ ఇచ్చింది. విచారణను పూర్తి చేసిన కమిషన్ ఒకటి రెండ్రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు రెడీ అవుతుంది. ఇంతలోనే నెల్లూరు ఏసీబీ కోర్టు పిక్చర్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. కల్తీ నెయ్యి ఇష్యూలో ఏసీబీ కోర్టు ఏం తేల్చనుంది?ఏడాదిగా కల్తీ నెయ్యి ఇష్యూ కంటిన్యూ అవుతూనే ఉంది. అప్పుడప్పుడు చల్లబడ్డట్లు..అంతా అయిపోయినట్లు కనిపిస్తూ..మళ్లీ కొత్త ట్విస్ట్‌తో తెరమీదకు వస్తోంది తిరుమల లడ్డూ ఎపిసోడ్. ఇప్పుడు మరోసారి నెల్లూరు ఏసీబీ కోర్టు విచారణ..ఏకసభ్య కమిషన్ రిపోర్ట్ అంటూ చర్చకు దారితీసింది. సుప్రీంకోర్టు వేసిన స్పెషల్ సిట్ దర్యాప్తు పూర్తి చేసి..రిపోర్ట్‌ను కూడా ఇచ్చేసింది. ఆ రిపోర్ట్‌పైనే ఐదారు నెలల కింద పొలిటికల్ ఫైట్ హీట్ వేవ్‌ను తలపించింది. ఏకంగా దాడులకు వరకు వెళ్లింది. సరిగ్గా అదే టైమ్‌లో అసలు వాస్తవాలేంటో తేల్చేందుకు కూటమి సర్కార్ ఏకసభ్య కమిషన్‌ను వేసింది. ఇప్పుడా కమిషన్ కూడా రిపోర్ట్ రెడీ చేసి..సర్కార్‌కు అందజేసేందుకు రెడీ అవుతోంది.ఇదిలా ఉండగా..లేటెస్ట్‌గా నెల్లూరు ఏసీబీ కోర్టు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. సిట్ వేసిన రెండు చార్జిషీట్లను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం..కేసు విచారణకు రెడీ అయింది. స్పెషల్ సిట్ ఫస్ట్ చార్జిషీట్‌లో 15 మంది, రెండో దాంట్లో 21 మందిని ..మొత్తం 36 మందిని సిట్ నిందితులుగా చేర్చింది. ఈ 36 మందిని నెల్లూరు ఏసీబీ కోర్టు విచారణకు పిలువనుంది.తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి వాడే నెయ్యి కోసం..కొందరు కావాలనే కక్కుర్తి పడి కల్తీ నెయ్యికు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారనే అలిగేషన్స్ ఉన్నాయి. అందిన కాడిక దోచుకునేందుకు..నెయ్యి క్వాలిటీ లేకపోయినా..క్వాలిటీ ఉన్నట్లు సర్టిఫికేట్ ఇచ్చి కల్తీ నెయ్యి సరఫరాకు గేట్లు తెరిచారన్న ఆరోపణలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే స్పెషల్ సిట్ పలు అంశాలను తాము దాఖలు చేసిన ఛార్జిషీట్లలో మెన్షన్ చేసింది. వాటి ఆధారంగా నెల్లూరు ఏసీబీ కోర్టు 36మంది నిందితులను విచారించేందుకు రెడీ అయింది.నెయ్యి కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు, కొన్ని ప్రైవేటు డెయిరీలు, కొంతమంది టీటీడీ ఉద్యోగులు..కాసులకు ఆశపడి.. కుట్రపూరితంగా కల్తీ నెయ్యి సప్లై చేశారనేది సిట్ మెయిన్ అలిగేషన్. ఈ క్రమలోనే మొత్తం 36 మందిని నిందితులుగా చేరుస్తూ రెండు చార్జిషీట్లు వేసింది. గతేడాది సెప్టెంబర్‌లోనే నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ రెండో ఛార్జిషీట్ వేసినా..అత్యంత సున్నితమైన కేసు కావడంతో ఛార్జిషీట్లను ఇన్ డిటేయిల్డ్‌గా స్టడీ చేయడం కోసం కోర్టు దాదాపు 9 నెలల సమయం తీసుకుంది. ఎట్టకేలకు సిట్ అలిగేషన్స్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు..త్వరలోనే నిందితులను విచారణకు పిలువనుంది.మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదంలో ఏపీ ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ విచారణను పూర్తి చేసింది. ఈ వ్యవహారంలో కీలక ఆధారాలు సేకరించిన కమిషన్, ఈ నెల 30న ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఫిబ్రవరి 20న ఏర్పాటైన ఈ ఏకసభ్య కమిషన్ తిరుమలలో పలుసార్లు పర్యటించింది. నెయ్యి కొనుగోలు విధానం, టెండర్ల ప్రక్రియ, నెయ్యి నాణ్యతను పరిశీలించింది. నెయ్యి సరఫరాలో జరిగిన లోపాలు, కల్తీకి కారణాలపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టింది. ఈ విచారణలో భాగంగా ఎక్స్‌పర్ట్స్ కమిటీ సభ్యుడు విజయ్ భాస్కర్ వాంగ్మూలాన్ని కమిషన్ నమోదు చేసిందినెయ్యి సేకరణలో నిబంధనలు, ఉల్లంఘనలు అన్నింటిపై డిటేయిల్స్ సేకరించింది. దర్యాప్తులో తేలిన అంశాలను నివేదిక రూపంలో ఈ నెల 30న స్టేట్ గవర్నమెంట్ అందజేయనుంది.

# పని మనిషి నుండి బంగారు వెండి ఆభరణాలు రికవరీ..



విభారే న్యూస్ మే 02 కర్నూలు జిల్లా ప్రతినిధి..15 తులాల బంగారు ఆభరణాలు,300 గ్రాముల వెండి వస్తువులు రికవరీ.కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూర్య దేవాలయం వద్ద గల వివేక్ నగర్లో నివాసం ఉంటున్న కృష్ణమూర్తి నాగేంద్ర అను అతని ఇంటిలో ఏప్రిల్ నెల 21వ తేదీ నుండి 27 వ తేదీ మధ్యలో వారి ఇంటిలోని సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులు కనిపించడం లేదని ఇంటికి తరుచుగా వచ్చే పనిమనిషి గాని లేదా కూరగాయలు తీసుకొచ్చి ఇచ్చే వ్యక్తి గాని వీటికి కారణం అయి ఉండొచ్చు అని అనుమానం వ్యక్తం చేస్తూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 4 వ పట్టణ పోలీవ్ స్టేషన్ సి ఐవిక్రమ్ సింహ కేసు నమోదు పరిచి దర్యాప్తులో భాగంగా అనుమానితులైన ఇద్దరినీ విచారించి అందులో దొంగతనానికి పాల్పడినది వన్ టౌన్ ఏరియాలో నివాసం ఉంటు ఫిర్యాది ఇంట్లో గత 3 నెలలుగా ఇంటి పని చేస్తున్న పనిమనిషి పర్వీన్ గా గుర్తించి, ఈ రోజున సదరు పనిమనిషిని వారి ఇంటి వద్దనే అరెస్టు చేసి, విచారించి, ఆమె ఇంటిలో దొంగలించబడి దాచుకున్న 15 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకోవడం అయినది.ఇందులో చురుకుగా పని చేసి,రికవరీకి సహకరించిన పి సి మురళి, హెచ్ సి జీనస్, పి సి సుబ్బారాయడు లను మరియు ఎస్పై గోపినాథ్, ఎస్ ఐ చంద్ర శేఖర్ లను కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ అభినందించడం జరిగింది.

## మాధవయ్య శెట్టి, లావణ్య దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలిపిన ఆర్యవైశ్య సంఘం వారు..




విభారే న్యూస్ మే 02 ఎమ్మిగనూరు..చి ॥ మాధవయ్య శెట్టి, చి ॥ కుం ॥సౌ ॥ లావణ్య దంపతులుగా ఒకటైన ఈ శుభ సందర్భంలో ఆర్యవైశ్య సంఘం వారు తరఫున వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్యవైశ్య సంఘం వారు ఈ నూతన వధూవరులకు ఆశీర్వాద పంచరత్నాలు పటములను అందజేసి వారి దంపతులను ఆశీర్వదించడం జరిగినది. ఈ శుభ సందర్భంలో యాయి ఈరన్న శెట్టి దంపతులు ఆర్యవైశ్య సంఘానికి 5,116/-లు, వీరి వీయ్యాంకులు కుంకనూరు గ్రామ వాస్తవ్యులు కీ "శే "కొట్రా రామాంజనేయులు శెట్టి దంపతులు2,116/-లు విరాళం ఇవ్వడం జరిగినది. కుల దేవత శ్రీ వాసవి మాత కృప కటాక్షాలతో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో పిల్లాపాపలతో హాయిగా జీవించాలని మనసారా సంఘం వారు కోరారు..

## కోతుల బావి ఆంజనేయస్వామి దేవాలయం నూతన కమిటీ ఎన్నిక...

విభారే న్యూస్ మే 02 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీ కోతుల బావి ఆంజనేయస్వామి నూతన కమిటీలో అపూర్వ సహోదరులు కోశాధికారి (ట్రెజరర్) గా ఆర్యవైశ్య ముద్దుబిడ్డ కానుల శ్యాం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మరో ఆర్యవైశ్య ముద్దుబిడ్డ కానుల రమేష్,



గౌరవ అధ్యక్షులుగా ఆర్యవైశ్య ముద్దుబిడ్డ రాజశేఖర్ గుప్తా ఎన్నికయ్యారు. ఈ కమిటీలు ఎన్నికైన ఆర్యవైశ్య ముద్దుబిడ్డలకు ఆర్యవైశ్య సంఘం,ఆటపా సంఘం, జిల్లా ఆర్యవైశ్య సంఘం వారు ప్రత్యేక హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు..

# టాప్ మార్కులతో మెరిసిన విద్యార్థులకు ఘన సన్మానం..

### విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి : డి.ఎస్.పి. భార్గవి..

విభారే న్యూస్ మే 02 ఎమ్మిగనూరు..పదో తరగతి పరీక్షల్లో పేదరికంలో ఉంటూ కూడా ఎన్నో కష్టాలను అధిగమించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్స్ స్వచ్ఛంద సేవ సమితి అధ్యక్షుడు వహాబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక డిఎస్పీ కార్యాలయంలో శనివారం ముందుగా డిఎస్పీ భార్గవి శాలువా కప్పి పూల బొకేను అందజేశారు. అనంతరం పదవ తరగతిలో నాగలదిన్నే గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి జంపుల వీరేశ్ మార్కులు 591/600 సాధించి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో



టాపర్ గా నిలిచాడు, మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కమ్మరి కల్పన మార్కులు 589/600 సాధించి టౌన్ టాపర్ గా నిలిచింది. 2 సార్లు నేషనల్ మీట్ లు, 4 సార్లు స్టేట్ మీట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఎస్.ఎన్.ఎస్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి కేఎండి వలి పోటీల్లో సత్తా చాటడమే కాకుండా పది పరీక్షలో మార్కులు 530/600 సాధించి చదువుల్లో టాప్..ఆటల్లో టాప్ గా నిలిచిన వివిధ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిఎస్పీ భార్గవి చేతుల మీదుగా నగదుతో పాటు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ..కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవడం ద్వారానే గొప్ప లక్ష్యాలను సాకారం చేసుకోవచ్చన్నారు. ఎన్నో ఏళ్ళుగా పేద విద్యార్థులకు సేవలు అందిస్తున్న ప్రిన్స్ సేవా సమితిని అభినందించారు. ఈకార్యక్రమంలో మంత్రాలయం ఎంఈఓ నాగభూషణం, సేవా సమితి అధ్యక్షుడు వహాబ్, కుమ్మరి శ్రీనివాసులు, హెచ్ఎం లు శోభ, జాన్సన్, క్రీడా ఉపాధ్యాయులు వెంకటేష్, విజయశిరీష, తల్లిదండ్రులు ఇంతియాజ్, బజారి తదితరులు పాల్గొన్నారు.

# బనగానపల్లెలో అన్న క్యాంటీన్ ప్రారంభం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 02:-పేదలకు నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. శనివారం బనగానపల్లెలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తో కలిసి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తక్కువ ధరకే శుభ్రతతో కూడిన ఆహారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు అన్న క్యాంటీన్లు ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు.ప్రారంభం అనంతరం మంత్రి, కలెక్టర్ స్వయంగా ఆహారం వడ్డించి ప్రజలతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 02:-జిల్లాలో జల వనరుల సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం బనగానపల్లె ప్రాంతంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.తిమ్మనాయునిపేట చెరువును పరిశీలించిన మంత్రి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జుర్రేరు వాగు ఆక్రమణలను కూడా పరిశీలించి, సహజ ప్రవాహానికి ఆటంకం కలిగించే వాటిని తొలగించాలని సూచించారు.జల వనరుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

# ఎవరెస్ట్ ట్రెక్కింగ్ విజయం--

### విద్యార్థులకు స్వాగతం---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 02 - నంద్యాల రైల్వే స్టేషన్‌లో ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్ పూర్తి చేసి వచ్చిన విద్యార్థులకు స్వాగతం పలికారు. నంద్యాల జిల్లా విద్యాధికారి పి జనార్దన్ రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు జగన్మోహన్ రెడ్డి, ప్రసన్న కుమార్‌లు విద్యార్థులను అభినందించారు.15 రోజుల క్రితం జిల్లా నుంచి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్‌కు బయలుదేరిన ఏడుగురు ప్రత్యేక అవసరాల విద్యార్థులు విజయవంతంగా ప్రయాణం పూర్తి చేసి నంద్యాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారి పట్టుదల, ధైర్యాన్ని అధికారులు ప్రశంసించారు.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులు అభినందనీయులని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అవకాశం కల్పించిన కలెక్టర్, ఎస్పీడీ, విద్యాశాఖ మంత్రి లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సమగ్ర శిక్ష బృందాన్ని అభినందించా



# కాల్వలపై హోటళ్లు నిర్మాణం--

### కమిషనర్ కఠినమైన హెచ్చరికలు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 02-నంద్యాల పట్టణంలోని చాంద్‌బాడ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న శనివారం పర్యటించి కాల్వల పరిస్థితిని పరిశీలించారు. కాల్వలపై అక్రమంగా హోటళ్ల నిర్వహణ, చెత్తను కాల్వల్లో వేయడం వంటి చర్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఈ చర్యలను నిలిపివేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కాల్వలు నగర పరిశుభ్రతకు కీలకమని, వాటిలో చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేయడం వల్ల నీటి ప్రవాహం ఆగిపోవడంతో పాటు దుర్వాసనలు, దోమల పెరుగుదలతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.కాల్వలపై అక్రమంగా హోటళ్లు నిర్వహిస్తున్న వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే తొలగింపులు కూడా చేపడతామని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపరైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి---

### మున్సిపల్ కమిషనర్ బి శేషన్న--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 02-నంద్యాల పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బి శేషన్న సోమవారం పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి ఆలస్యం, నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ముఖ్యంగా సమయపాలన పాటించడంలో ఎటువంటి అలసత్వం సహించబోమని హెచ్చరించారు.సచివాలయాలకు వచ్చిన ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా, వేగంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేవల విషయంలో ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, హాజరు నమోదు వంటి అంశాలను కూడా కమిషనర్ స్వయంగా పరిశీలించి లోపాలను గుర్తించారు. అవసరమైన చోట వెంటనే సవరణలు చేయాలని ఆదేశించారు. సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంచే విధంగా పని చేయాలని సూచించారు.ఈ తనిఖీలలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపరైజర్లు లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతకు చర్యలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 02-నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 29 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి వాటి మెరుగుదలకు చర్యలు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా మరియు ఎస్పీ సునీల్ షొరాణ్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.జాతీయ రహదారి పరిధిలోని 9 ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నంద్యాల పట్టణంలోని 6 ముఖ్య ప్రాంతాలను కూడా తనిఖీ చేశారు.ప్రమాదాల నివారణకు రోడ్డుల విస్తరణ, మలుపుల సరిదిద్దడం, వేగ నిరోధకాలు మరియు సూచిక బోర్డుల ఏర్పాటు, ప్రమాదకర ప్రాంతాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నారు. జంక్షన్లలో రోడ్డు లోపాలను సరిచేసి రాకపోకలను సులభతరం చేయనున్నారు.మిగిలిన ప్రాంతాలపై కూడా త్వరలో నివేదిక సిద్ధం చేసి పనులు ప్రారంభించనున్నారు. జిల్లాను ప్రమాద రహితంగా మార్చడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190